క్లుప్తంగా

93వ వార్డులో ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్తు'



మహిళలకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న అజయ్‌రాజ్

సింహాచలం : జీవీఎంసీ 93వ వార్డు పరిధి దుర్గానగర్‌లో బుధవారం 'జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. పెందుర్తి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్ ఇంటింటికీ వెళ్లి గడచిన నాలుగేళ్లుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 93వ వార్డు నాయకులు దాసరి సత్తిబాబు, వినోద్, బండి సత్తిబాబు, జిలానీ, నిర్మల, తాతబాబు, శ్రీకాంత్, రవి, బాబూరావు, వలెంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

భక్తులకు అన్న సమారాధన



భక్తులకు వడ్డన చేస్తున్న మహేష్

సింహాచలం : గంధం అమావాస్యను పురస్కరించుకుని సింహాచలం వచ్చిన భక్తులకు బంటుబిల్లి మహేష్ సేవా సంస్థ తరపున ఆరువేల మందికి గురువారం భోజన వితరణ చేశారు. కొండదిగువ వరాహ పుష్కరిణికి వెళ్లే మార్గం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. భక్తులకు మహేష్ తదితరులు అన్నవడ్డన చేశారు. కార్యక్రమంలో సేవా సంస్థ సభ్యులు చిరంజీవిరావు, గోపి తదితరులు పాల్గొన్నారు. అలాగే సింహాచలానికి చెందిన అక్షయ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో పుష్కరిణి సత్రం వద్ద పెద్ద ఎత్తున్న అన్నసమారాధన చేశారు.

ఘనంగా మరిడిమాంబ పండగ



మరిడిమాంబ అమ్మవారి సన్నిధిలో గ్రామపెద్దలు

పరవాడ: మండలంలోని గొర్లివానిపాలెం గ్రామంలో కొలువుదీరిన మరిడిమాంబ అమ్మవారి పండగ మహోత్సవాలను గ్రామ ప్రజలు గురువారం భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. అమ్మవారికి వేకువజాము నుంచి భక్తులు పసుపుకుంకుమలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గొర్లి గోపీ, గొర్లి ఎరుకునాయుడు, గొర్లి రామారావు, పైల అప్పారావు, రొంగలి నాయుడు, శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. రాత్రికి డప్పు వాయిద్యాలు, చిడతలు, తప్పెటగుళ్లు, డ్యాన్సులతో అమ్మవారి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. అనంతరం భారీ బాణసంచా కాల్పుల మధ్య అమ్మవారి అనుపు మహోత్సవాన్ని నిర్వహించారు. పండగ మహోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఇంద్రసేన పాలకు వర్సిటీ డాక్టరేట్



వీసీ ప్రసాదరెడ్డి నుంచి ఉత్తర్వులు స్వీకరిస్తున్న ఇంద్రసేన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం రాజనీతి, ప్రభుత్వ పాలన శాస్త్రం విభాగ పరిశోధక విద్యార్థి ఇంద్రసేన పాలకు ఏయూ డాక్టరేట్ లభించింది. విభాగ విశ్రాంత ఆచార్యులు ఇ.ఎ.నారాయణ, డాక్టర్ పి.ప్రేమానందం సంయుక్త పర్యవేక్షణలో 'రోల్ ఆఫ్ ఎన్‌జీవో ఇన్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఇన్ నార్త్ కోస్టల్ డిస్ట్రిక్ట్స్–ఆంధ్రప్రదేశ్'అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ వరించింది. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను ఇంద్రసేన పాల స్వీకరించారు.

క్రీడాకారుల కల.. సాకారమవుతున్న వేళ

● ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవం నేడు



స్టేడియం ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



ప్రారంభానికి ముస్తాబైన ఇండోర్ స్టేడియం సముదాయం

పరవాడ: పరవాడ ప్రాంత క్రీడాకారుల కల తీరనుంది. స్థానిక జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ సమీపంలో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తి చేసుకుని, ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఇండోర్ స్టేడియం సముదాయాన్ని టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వై.వి. సుబ్బారెడ్డి శుక్రవారం మధ్యాహ్నం 3గంటలకు ప్రారంభించనున్నారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ కార్యక్రమంలో పాల్గొనున్నారు.

ఇండోర్ స్టేడియం అందుబాటులోకి రానుండటంతో పరవాడ ప్రాంత క్రీడాకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ స్టేడియంలో క్రీడాకారులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించారు. స్టేడియం లోపల షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులు, టేబుల్ టెన్నిస్ రూం, కోచ్ సముదాయం, క్రీడా పరికరాలకు స్టోర్ రూం, టాయిలెట్స్‌తో పాటు స్టేడియం లోపల విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. తాగునీటి అవసరాలను తీర్చడం కోసం బోర్ వెల్‌ను ఏర్పాటు చేశారు.

స్టేడియం పరిశీలన

పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ గురువారం ఉదయం స్టేడియంను సందర్శించారు. ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఇంజినీరింగ్ అధికారులకు సూచనలు చేశారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, పంచాయతీ రాజ్ ఏఈ గండి రామారావు, గొర్లివానిపాలెం సర్పంచ్ గొర్లి గోపి అమ్మలు, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, నాయకులు చల్లా కనకారావు, వెన్నల సన్యాసిరావు తదితరులున్నారు.



ఇండోర్ స్టేడియం లోపలి భాగం

గురుకులంలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



అప్పలనాయుడు, ప్రిన్సిపాల్, గురుకుల పాఠశాల

పరవాడ: తానాంలోని మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ మీసాల అప్పలనాయుడు తెలిపారు. కళాశాలలో ఎంపీసీ–60, బైపీసీ–40, ఎంఈసీ–40, సీఈసీ–40 సీట్లు ఉన్నాయని చెప్పారు. కళాశాలలో ఉచిత విద్య, భోజనం, వసతి, పాఠ్య పుస్తకాలతో పాటు ఆహ్లాదకరమైన క్రీడా ప్రాంగణం తదితర సౌకర్యాలు ఉన్నాయని తెలియజేశారు. దరఖాస్తులను ఈ నెల 19 నుంచి మే 18వ తేదీ లోగా ఆన్‌లైన్ ద్వారా పంపాలని సూచించారు. ప్రవేశ పరీక్షను మే 28న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తామన్నారు. దరఖాస్తు రుసుంగా రూ.250 చెల్లించి, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్షకు హాజరు కావాలనుకునే విద్యార్థినులు 10వ తరగతిలో తెలుగు/ఇంగ్లిష్ మాధ్యమంలో చదివి, ఈ ఏడాది మార్చిలో జరిగిన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఉండాలని చెప్పారు. విద్యార్థిని వయసు 17 ఏళ్లు నిండకూడదని, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్షకు మించకుండా ఉండాలని తెలిపారు. ప్రవేశ పరీక్షకు విశాఖ, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణ, గుంటూరు జిల్లాలకు చెందిన విద్యార్థినులు మాత్రమే అర్హులని వివరించారు.

పెనాల్టీల నుంచి ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలి



చీఫ్ మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మహారాణిపేట : బ్యాంకులు పెనాల్టీలు, చార్జీల నుంచి ఉద్యోగులు, పెన్షనర్లకు మినహాయింపు ఇవ్వాలని ఉద్యోగ సంఘాల కార్యాచరణ సమితి (అమరావతి) జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రదర్శన జరిగింది. కలెక్టరేట్ ఆవరణలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదుట జరిగిన ప్రదర్శనలో జేఏసీ చైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ బ్యాంకులు విధించే పెనాల్టీల వల్ల ఉద్యోగుల సిబిల్ స్కోరు తగ్గిపోతుందని, దీని నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు మినహాయింపు ఇచ్చి, అదనపు భారాన్ని తొలగించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు త్రినాథరావు, ప్రధాన కార్యదర్శి సీహెచ్‌వీ రమేష్, కోశాధికారి రవిశంకర్, జేఏసీ కో చైర్మన్ నమ్మి శ్రీనివాసరావు, కార్యదర్శి మహేష్, ఉద్యోగులు, పెన్షనర్లు హాజరయ్యారు. అనంతరం చీఫ్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు.

సిరులతల్లికి సహస్ర తులసిపూజ

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి గురువారం ఘనంగా సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రానవవర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు .కార్యక్రమంలో ఆలయ ఈవో కె. రమేష్‌నాయుడు, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు, ఏఈవో వెంపలి రాంబాబు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



ప్లాట్‌ఫాం నంబర్–8లో వ్యక్తి మృతదేహం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం నంబర్–8లో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మరణించాడు. గవర్నమెంట్ రైల్వే పోలీస్(జీఆర్పీ) ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు ఆదేశాల మేరకు ఎస్ఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఎస్ఐ తెలిపిన వివరాలిలా.. గురువారం ఉదయం 5.45 గంటల ప్రాంతంలో విశాఖ రైల్వేస్టేషన్ 8వ నంబర్ ప్లాట్‌ఫాంపై ఓ వ్యక్తి మృతిచెంది ఉన్నాడు. ఏదో రైలు నుంచి జారిపడటం గానీ, లేదా రైలు ఎక్కుతున్న సమయంలో జారిపడటం వల్ల గానీ మరణించి ఉండవచ్చు. మృతుడి వయసు సుమారు 30–35 ఏళ్లు ఉంటుంది. ఇతడి వద్ద ఏవిధమైన ఆధారాలు లేవు. ఈ వ్యక్తి పసుపు, తెలుపు రంగు టీ షర్ట్, కాఫీ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మెడలో నలుపు రంగు తాడు, కుడిచేతి మీద నాగుపాము, ఓంకార గుర్తులు పచ్చబొట్లు ఉన్నాయి. ఈ మృతదేహం కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు విశాఖ రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ వద్ద స్వయంగా గానీ లేదా 94406 27547, 98664 13487 నంబర్లలో తెలియజేయాలని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

టి.నగరపాలెంలో త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



ప్రమాదానికి గురైన మూడు వాహనాలు

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీ జాతీయరహదారిపై గురువారం పెను ప్రమాదం తప్పింది. తగరపువలస మీదుగా విజయనగరం వైపు వెళ్తున్న కాంక్రీట్ మిక్సర్ ముందు వెళ్తున్న మరొక మిక్సర్ అడ్డు రావడంతో ఎడమవైపు మళ్లింది. అదే సమయంలో విశాఖ నుంచి విజయనగరం వెళ్తున్న సిటీబస్సు, దాని ముందు వెళ్తున్న కారుపైకి కాంక్రీట్ లోడుతో ఉన్న మిక్సర్ దూసుకువచ్చింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 80 మంది ప్రయాణికులు ఉండగా వీరిలో ఎక్కువమంది విద్యార్థులే. ఈ ప్రమాదంలో మూడు వాహనాలలో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. భీమిలి ట్రాఫిక్ ఎస్ఐ చింతలపూడి చిరంజీవి, సిబ్బంది ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు.

ఎన్ఎస్ఎస్‌తో విద్యార్థుల్లో సేవా స్ఫూర్తి

ఏయూ క్యాంపస్: విద్యార్థుల్లో సేవా స్ఫూర్తిని పెంచేలా ఎన్ఎస్ఎస్ నిలుస్తుందని ఏయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం ఏయూ ఫార్మసీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వర్సిటీకి దగ్గరలో ఉన్న రెల్లివీధి ప్రాంతాన్ని దత్తత తీసుకుని వారం రోజుల పాటు సేవా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించడం అభినందనీయమన్నారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎస్.హరనాథ్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఎన్ఎస్ఎస్‌లో యువత భాగస్వాములై విభిన్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పి.శైలజ మాట్లాడుతూ విద్యార్థులను భాగస్వాములను చేస్తూ 7 రోజుల పాటు 7 ప్రత్యేక కార్యక్రమాలను చేపడతామన్నారు.

గ్రామంలో స్నేహపూర్వక వాతావరణం అవసరం

సబ్బవరం: గ్రామంలో శాంతిభద్రతలకు ఆటంకం కలగకుండా గ్రామస్తులంతా స్నేహపూర్వక వాతావరణంలో కలిసి మెలిసి ఉండాలని సీఐ రంగనాథం సూచించారు. మండలంలోని పెదగొల్లలపాలెం గ్రామంలో సీఐ రంగనాథం, ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామస్తులకు గురువారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఇటీవల గ్రామంలో జరిగిన వివాదంతో ఇరువర్గాల కొట్లాటలో 10 మందిపై కేసు నమోదు చేసిన నేపథ్యంలో ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కోర్టులు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతూ విలువైన సమయాన్ని, డబ్బును వృథా చేసుకోవద్దని సూచించారు. గ్రామంలోని ఆరుగురు సభ్యులతో పాటు గ్రామ దత్తత కానిస్టేబుల్, సచివాలయ పోలీసులకు ఈ కమిటీలో సభ్యులుగా అవకాశం కల్పించినట్లు తెలియజేశారు. గ్రామంలో సమస్య వస్తే ఆ గ్రామ శాంతి (పీస్) కమిటీ సభ్యులు, గ్రామ దత్తత కానిస్టేబుల్, గ్రామ సచివాలయ పోలీస్‌తో కలిపి సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేయాలన్నారు.

వైవీ సుబ్బారెడ్డి పర్యటనను విజయవంతం చేయాలి

సబ్బవరం: పరవాడ మండలంలో టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి శుక్రవారం పర్యటించనున్న నేపథ్యంలో పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా సబ్బవరంలోని పార్టీ ముఖ్య నాయకులు, అనుబంధ కమిటీల అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని మండల పార్టీ కన్వీనర్ కర్రిబాబు తెలిపారు. సాయంత్రం 3 గంటలకు ఎంపీడీవో కార్యాలయం వద్దకు అంతా తరలి వస్తే అక్కడి నుంచి బయలుదేరి వెళ్లనున్నట్లు తెలిపారు.

పుస్తకాల బహూకరణ



పుస్తకాలు బహూకరిస్తున్న డాక్టర్ సులేమాన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం రాజనీతి, ప్రభుత్వ పాలన శాస్త్రం విభాగానికి డాక్టర్ సులేమాన్ పలు పుస్తకాలను బహూకరించారు. విభాగ విద్యార్థులకు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు ఉపయుక్తంగా రూ.3 వేలు విలువ చేసే పుస్తకాలను గురువారం విభాగాధిపతి డాక్టర్ జి.వీ రాజుకు అందజేశారు. డాక్టర్ సులేమాన్ విభాగంలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా సేవలు అందిస్తున్నారు. ఈయన భారత ప్రభుత్వంలో ఉన్నతోద్యోగిగా సేవలు అందించి పదవీ విరమణ చేశారు. ఈ కార్యక్రమంలో విభాగ అధ్యాపకులు డాక్టర్ హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

పౌర గ్రంథాలయంలో క్విజ్ పోటీ



విజేతలతో క్విజ్ మాస్టర్ సూర్యారావు

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు గురువారం గ్రంథాలయ సొసైటీ ఆధ్వర్యంలో క్విజ్ పోటీ నిర్వహించారు. 70 మంది విద్యార్థులు గ్రూపులుగా పాల్గొన్నారు. సమకాలీన అంశాలు, చరిత్ర, జాతీయ ఉద్యమం, శాస్త్ర సాంకేతిక విజ్ఞానం, ఆర్థిక, రాజనీతి, భూగోళ శాస్త్రాలు మొదలైన విషయాలపై 70 ప్రశ్నలు అడిగారు. గ్రంథాలయ సహ కార్యదర్శి డి.వి.సూర్యారావు క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించారు. విజేతలకు పుస్తకాలను బహుమతిగా అందజేశారు.

చందనోత్సవ భక్తులకు సదుపాయాలు కల్పించాలి

● అధికారులను ఆదేశించిన జీవీఎంసీ కమిషనర్
● సింహాచలం కొండ దిగువ ప్రాంతాల పరిశీలన



సింహాచలం కొండదిగువ పర్యటిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ

సింహాచలం : ఈనెల 23న జరిగే చందనోత్సవం రోజు వచ్చే భక్తులకు తాగునీరు, ఓఆర్ఎస్ ద్రవం సమృద్ధిగా అందించాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ అధికారులను ఆదేశించారు. సింహాచలం కొండ దిగువ ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవానికి వేలాదిగా భక్తులు వస్తారని, ఎండలు ఎక్కువగా ఉన్నందున జనసంచారం ఉన్న ప్రతిచోట తాగునీరు అందేలా చూడాలన్నారు. అలాగే భక్తుల కోసం పార్కింగ్ ప్రదేశాల్లో మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ దీపాలు ఉండాలని సూచించారు. ఎక్కడా భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, ఎక్కడికక్కడ ప్రాంతాలను తెలిపే సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భక్తులకు దాతలు అందించే ఉచిత ప్రసాద వితరణ వద్ద ఎక్కడా ప్లాస్టిక్ వినియోగం లేకుండా అవగాహన కల్పించాలని సూచించారు. వ్యర్థాల కోసం ప్రతిచోట డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలను అధికారులను ఆదేశించారు. అలాగే 98వ వార్డులో భవన నిర్మాణ వ్యర్థాలు అధికంగా కనిపిస్తున్నాయని, వాటిని యుద్ధప్రాతిపదికన తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. వార్డు సచివాలయ శానిటరీ కార్యదర్శులు, ప్రజారోగ్య కార్యదర్శులను ఏయే విధులు నిర్వర్తిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. వారికి పలు సూచనలు చేశారు. బీఆర్‌టీఎస్ రోడ్డులో స్వీపింగ్ సరిగ్గా చేయలేదని, మధ్యాహ్నం పారిశుధ్య కార్మికులచే శుభ్రం చేయించాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. వార్డులో ఉన్న ఖాళీ స్థలాల్లో చెత్త అధికంగా ఉందని, స్థల యజమానులతో మాట్లాడి చెత్తను శుభ్రం చేయించాలన్నారు. ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు వేయకుండా నిర్వాసితులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం, జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, పర్యవేక్షక ఇంజినీర్ వేణుగోపాలరావు, రామ్మోహనరావు, హార్టీకల్చర్ డీడీ ఎం. దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున. చిత్రంలో జేసీ విశ్వనాథన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి

మహారాణిపేట : వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు రెడ్‌క్రాస్ సొసైటీ, విశాఖ డెయిరీ సంయుక్త ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఇలాంటి చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి స్వచ్ఛంద సంస్థలు, సేవా సంఘాలు ముందు కొచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వేసవికాలం అంతా చలివేంద్రం నిర్వహిస్తారని అన్నారు. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం స్పందన కార్యక్రమానికి 100 నుంచి 200 మంది అర్జీదారులు వస్తారని, వారికి భోజనం కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి మండల తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో కూడా చలివేంద్రం ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. చలివేంద్రం ఏర్పాటుకు సహకరించిన రెడ్‌క్రాస్ సొసైటీ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, విశాఖ డెయిరీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం ప్రజలకు చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, రెడ్‌క్రాస్ సొసైటీ మెంబర్ ఎస్‌కేఎల్ రావు, విశాఖ డెయిరీ మార్కెటింగ్ మేనేజర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

25న శారదాపీఠంలో శంకరాచార్య జయంత్యుత్సవం



శ్రీశారదాపీఠంలో ఆదిశంకరాచార్య విగ్రహం

సింహాచలం: జగద్గురు ఆదిశంకరాచార్య జయంత్యుత్సవాలను ఈ నెల 25న విశాఖ శ్రీ శారదాపీఠంలో ఘనంగా నిర్వహించేందుకు పీఠం ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. శంకర జయంతిని ధార్మిక కార్యక్రమాలతో వేడుకగా నిర్వహించాలని శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి నిర్ణయించారు. ఈ మేరకు పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి, స్వధర్మ వాహిని సంస్థ సంయుక్త నిర్వహణలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

కార్యక్రమ వివరాలివీ..

ఉదయం ఆది శంకరాచార్యులకు విశేష అభిషేకం, మహా మంగళ హారతులతో శంకర జయంతి వేడుకలు ప్రారంభమవుతాయి. అనంతరం శంకరాచార్య రచించిన ఉపనిషత్తులను పారాయణ చేస్తారు. మధ్యాహ్నం 3గంటల నుంచి వేద పరిమళం పేరిట వేద సభను నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రఖ్యాతి గాంచిన వేద పండితులు ఈ సభలో పాల్గొననున్నారు. అదే సమయంలో విష్ణు సహస్రనామ పారాయణ, లలితా సహస్రనామ పారాయణ ఉంటుంది. సాయంత్రం 5గంటలకు శంకర స్వరఝరి పేరిట శంకరాచార్య కృతులతో సంగీత కచేరీ ఉంటుంది. తదుపరి శంకరాచార్యుల వారి వైభవాన్ని చాటిచెప్పేలా శంకర సౌరభం పేరుతో ధార్మిక సభ నిర్వహిస్తారు. ఇందులో శంకర స్ఫూర్తిని చాటేలా ఆధ్యాత్మిక వేత్తల ప్రవచనాలు ఉంటాయి. అలాగే శ్రీ శారదా స్వరూప రాజశ్యామల, చంద్రమౌళీశ్వరులకు పీఠార్చన నిర్వహిస్తారు. శంకర సంప్రదాయాన్ని అనుసరిస్తూ ఆదిశంకరుల వారి అద్వైత సిద్ధాంతాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్న పీఠాల్లో కీలకమైనది విశాఖ శ్రీశారదాపీఠం అని ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి తెలిపారు. భారతీయ సనాతన ధార్మిక సంస్కృతికి మూలాధారం చదుర్వేదాలేనని, వేద పరిరక్షణ కోసమే వేదసభను నిర్వహిస్తున్నామని తెలియజేశారు. వేడుకల్లో అందరూ పాల్గొనాలని స్వామీజీ పిలుపునిచ్చారు.

బైబై వైజాగ్



లొకేషన్‌లో విక్టరీ వెంకటేష్

కొమ్మాది: ప్రముఖ కథానాయకుడు విక్టరీ వెంకటేష్ హైదరాబాద్‌కు పయనమయ్యారు. పది రోజులు నుంచి ఉక్కు నగరంలో జరుగుతున్న సైంధవ్ సినిమా షూటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. గురువారం మధ్యాహ్నం వరకు షూటింగ్‌లో పాల్గొని ఆయన హైదరాబాద్ పయనమయ్యారు. రెండు రోజుల తరువాత భీమిలి లేదా కాకినాడ ప్రాంతాల్లో సినిమా చిత్రీకరణ ఉండనున్నట్లు సినీవర్గాలు తెలిపాయి.

వెంకటేష్‌ను కలిసిన అభిమానులు

సైంధవ్ సినిమా చిత్రీకరణలో భాగంగా నగరంలో ఉంటున్న విక్టరీ వెంకటేష్‌ను విశాఖ సిటీ వైడ్ డీవీఆర్ ఫ్యాన్స్ ప్రెసిడెంట్ అర్జి శంకర్రావు, జిల్లా ప్రెసిడెంట్ పిళ్లా శ్రీను మర్యాద పూర్వకంగా కలిశారు. సైంధవ్ సినిమా సూపర్ హిట్ కావాలని ఆకాంక్షించారు.

'కార్మికులకు అన్యాయం చేస్తే మూల్యం తప్పదు'

కూర్మన్నపాలెం: కేంద్రప్రభుత్వం విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని క్యాబినెట్ సమావేశంలో ప్రకటన చేసేవరకు ఉద్యమం విరమించేది లేదని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. సంస్థకు సొంత గనులు కేటాయించి, ఉత్పత్తి పునరుద్ధరిస్తామని ప్రకటించాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే దీక్షలు 798వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో ఉక్కు కార్మికులు పాల్గొని 'విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు' అంటూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలో కొనసాగించే వరకు కార్మికుల ఉద్యమం ఆగదన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రభుత్వరంగ సంస్థలను హీనంగా చూడడం ఒక్క బీజేపీ ప్రభుత్వానికే చెల్లిందని విమర్శించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.